క్లుప్తంగా

19న యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ అధ్యక్షతన జరిగే కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. సమావేశానికి మండల ప్రాదేశిక నియోజక వర్గం సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు తమశాఖల పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి కేవలం సమీక్ష మాత్రమే కొనసాగుతుందన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 15 కళాకారుల కుటుంబాలు



నరసరావుపేట: ప్రముఖ హార్మోనిస్టు మోదుగుల శ్రీనువాసరావు ఆధ్వర్యంలో 15 కళాకారుల కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వారందరికీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ హార్మోనిస్టులు, కళాకారులు పార్టీలో చేరటం సంతోషంగా ఉందన్నారు. కళలనే నమ్ముకున్న వీరందరూ పార్టీతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై అభిమానంతో చేరారన్నారు. వారందరికీ తాను అండగా ఉంటానని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి




బొల్లాపల్లి : బీసీ కులాలకు మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని బీసీ కార్పొరేషన్ చైర్మన్ కె.వెంకట నారాయణ (ముదిరాజ్) అన్నారు. మండలంలో బీసీలను చైతన్య పరుస్తూ పలు గ్రామాల్లో ముదిరాజ్‌లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నరసరావుపేట పేట పార్లమెంటు అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను, వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడును గెలిపించుకోవాలని, బీసీలంతా ఐక్యంగా ఉండాలని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆకాంక్షించారు. పేదలకు నవరత్న పథకాలు అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ

రొంపిచర్ల: వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాలలో మంచినీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు వల్ల దాని కనుగుణంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పనులు, ఇతర అంశాలపై సమీక్షించారు. గ్రామాలలో మంచి నీటి సమస్య తలెత్తితే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టవలసిన పనులు గుర్తించి కూలీలకు పనులు కల్పించాలని అన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇరుగుల మాధవి, ఇన్‌చార్జి ఎండీవో సీహెచ్‌వి లక్ష్మీకుమారి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



పత్తి శ్రీనాథ్ (ఫైల్)

బొల్లాపల్లి: స్నేహితులతో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మండలంలోని పేరూరుపాడు గ్రామానికి చెందిన పత్తి శ్రీనాథ్ (19) ఈ నెల 14న స్నేహితులతో కలిసి నాగార్జున సాగర్ కుడికాలువకు ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో గల్లంతయ్యాడు. స్నేహితులు బంధువులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించగా గాలింపు చేపట్టారు. గుట్లపల్లి సమీపంలోని లాక్కుల వద్ద తేలాడుతున్న మృతదేహాన్ని గమనించి వెలికితీశారు. మృతుడికి తల్లి వెంకటరమణ, సోదరుడు ఉన్నాడు. రెక్కల కష్టంపై ఆధారపడి కుటుంబం కావడంతో తల్లికి ఆర్థికంగా చేదోడుగా ఉంటున్న శ్రీనాథ్ మృతితో తల్లి రోదనలు మిన్నంటాయి.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం కావాలి

- ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పిలుపు
- వినుకొండలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం
- 22న బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్ కార్యక్రమం



మాట్లాడుతున్న నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా బొల్లా బ్రహ్మనాయుడును అఖండ మెజార్టీతో గెలిపించాలని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బొల్లా కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, అనిల్‌కుమార్ యాదవ్, యువనాయకులు బొల్లా గిరిబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడుకు మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని, ఓటు రూపంలో మన అభ్యర్థిని గెలిపించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

లబ్ధిదారులకు సంక్షేమం–అభివృద్ధి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలు రూ.1663.99 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని, వినుకొండ పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు రామలింగేశ్వరాలయం, ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరి ప్రదక్షిణ రోడ్డు, ఎన్ఎస్‌పీ కాలువల ఆధునికీకరణ, 100 పడకల ఆసుపత్రి, ముస్లిం గురుకుల పాఠశాల, షాదీఖానా, కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. గతంలో పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభివృద్ధి పనులపై కోర్టులో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప వినుకొండ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తమతో పాటు ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. యువనాయకులు బొల్లా గిరిబాబు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం గత పదేళ్లల్లో ఎలా ఉంది, ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందని ప్రజలు బేరీజు వేసుకోవాలని, ఐదేళ్లల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన అభివృద్ధిని గుర్తించాలన్నారు. మరో మారు ఎమ్మెల్యేగా బొల్లాను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీలు, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి



28వ వార్డు ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ విభాగ డాక్టర్లు

- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి
- ఒకటో వార్డులో ప్రచారం
- 28వ వార్డు ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ డాక్టర్ల బృందం



ఒకటో వార్డు ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సంక్షేమ పథకాలు, పింఛన్లు ఇళ్లకు తీసుకొచ్చే వలంటీర్ల వ్యవస్థ కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకటో వార్డు కూనిశెట్టి సత్రం వెనుకవైపు, గుర్రాల చావిడి బజార్లలో ఇంటింటికీ పర్యటించారు. ఇప్పటి వరకు ఏమేమి పథకాలు అందాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో ఏదో ఒక పథకం అందుతుందని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఐదేళ్లలో కూడా పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, తనను గెలిపించాలని కోరారు. చంద్రబాబు వైపు చూశారంటే అన్నీ పథకాలు కోల్పోతారని హెచ్చరించారు. డ్వాక్రా మహిళలతో మాట్లాడి రుణమాఫీ చేసిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, పట్టణ కన్వీనర్ ఎస్.ఏ.హనీఫ్, గిరిజన కార్పొరేషన్ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి రాము, బాబ్జి, వార్డు నాయకులు మక్కెళ్ల మల్లికార్జునరావు, తిప్పరయ్య, జెస్సీకా, బండి వాసంతి, మల్లెల అనీల పాల్గొన్నారు.

డాక్టర్ సుష్మితా ప్రచారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితారెడ్డి మంగళవారం 24వ వార్డు రామిరెడ్డిపేట పాతసమితి కార్యాలయం నుంచి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారులను కలుసుకొని పార్టీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ కాకుమాను సదాశివరెడ్డి, వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము సుబ్బారెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, రామిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

వైద్య బృందం ప్రచారం

ప్రజాదరణ చూస్తుంటే జరగబోయే ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనీల్ కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రికార్డు మెజార్టీతో గెలవబోతున్నారని బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ డాక్టర్ల సెల్‌కు చెందిన పలువురు డాక్టర్లు పట్టణంలోని 28వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. డాక్టర్లతో పాటు పాల్గొన్న మహాత్మాగాంధీ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షులు, ఆర్యవైశ్య నాయకులు అత్తులూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా ఖచ్చితంగా వైనాట్ 175 సీట్లు గెలుస్తారన్నారు. పలువురు డాక్టర్లు, సీమాంధ్ర డ్రగ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు, వంకా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అయ్యాయి. రహ దారిపై మొక్కలకు నీళ్లు పడుతున్న ట్యాంకర్‌ను ఒంగోలు వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయాలైన డ్రైవర్‌ను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయన తార మంగళవారం తెలిపారు. స్థానిక పెద్దచెరువులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 10 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న గుంజి రామాంజనేయులను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

చికిత్సపొందుతూ రైతు మృతి



మృతుడు వెంకటేశ్వర్లు

బొల్లాపల్లి: అప్పుల బాధ తాళలేక రైతు పురుగు మందు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో జరిగింది. బండ్లమోటు పోలీసుల సమాచారం మేరకు... గ్రామానికి చెందిన తెల్లగొర్ల వెంకటేశ్వర్లు (44) అప్పుల బాధతో పురుగుమందు సేవించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకటేశ్వర్లు ఈ నెల 14న పురుగుమందు సేవించి నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ 15న రాత్రి మృతిచెందాడు. తన సొంత పొలం ఎకరంతో పాటు 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశాడు.

కొత్తగా బోర్లు వేయడంతో నీరు పడక ఉన్న బోర్లలో నీరు రాక సుమారు రూ.6 లక్షలు అప్పు అయిందని, ఈ నేపథ్యంలో అప్పుల బాధ తాళలేక మనస్తాపంతో పురుగుమందు సేవించాడు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇరువురు సంతానం ఉన్నారు. వెంకటేశ్వర్లు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

రామయ్య కల్యాణానికి అంతా సిద్ధం

నాదెండ్ల: శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా గ్రామాల్లోని కోదండ రామాలయాలు సిద్ధమయ్యాయి. బుధవారం నవమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం కల్యాణ మహోత్సవం అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. గణపవరం గ్రామంలో గతేడాది రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన ఆలయంలో ఐదు రోజుల పాటూ నిర్వహించే వేడుకలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ప్రధాన పూజారులు దర్భి ఉమామహేశ్వరరావు, అనిల్‌కుమార్ తెలిపారు. శాంతినగర్ కోదండ రామాలయంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలు పది రోజుల పాటూ జరగనున్నాయి. మంగళవారం దుర్గాహోమం, మహామంత్ర హోమం నిర్వహించారు. బుధవారం స్వామివార్ల కల్యాణం, గురువారం 108 కలశాలతో మహాస్నపన కార్యక్రమం, పంచామృతాభిషేకాలు, అనంతరం మహాపట్టాభిషేకం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో కోటప్పకొండలోని వేద పాఠశాలలో అగ్ని ప్రమాదాలు – నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఫైర్ ఆఫీసర్ ఎం.వి.సుబ్బారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చేపట్టాల్సిన చర్యలను సిబ్బంది ప్రత్యక్షంగా విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ జమ్ముల శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ బి.కిరణ్, ఫైర్‌మెన్ వివిఎస్ ప్రసాదు, సతీష్‌బాబు, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

సత్తెనపల్లి : ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఏ. థౌషీద్ హుస్సేన్ అన్నారు. తాలూకా కోర్టు ప్రాంగణంలో డాక్టర్ కొంగర శ్రీకాంత్ పర్యవేక్షణలో కొనాక్ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఏ థౌషీద్ హుస్సేన్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ ప్రారంభించారు. న్యాయవాదులు, గుమస్తాలు, నాలుగు కోర్టుల సిబ్బంది, కక్షి దారులు, పోలీస్ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు ఏపీపీ బగ్గి నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్, అన్నెం వెంకటకృష్ణరెడ్డి, సురే వీరయ్య, రాజవరపు.నరసింహారావు, గుమస్తాలు మర్రి నరసింహారావు, వలేటి రవి, గేరా రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా శ్లాస్ పరీక్ష

సత్తెనపల్లి: విద్యార్థుల్లో ఖచ్చితమైన సామర్థ్యాలు తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా మంగళవారం నాలుగో తరగతి విద్యార్థులకు శ్లాస్ పరీక్షను నిర్వహించారు. ఎంపిక చేసిన ఏడు పాఠశాలలకు పరీక్ష పత్రాలను సరఫరా చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్యార్థి తరగతి పూర్తయ్యేసరికి ఆ తరగతికి సంబంధించిన విద్యా సామర్థ్యాలు, పాఠశాల విద్య పూర్తయ్యేసరికి సాధించాల్సిన లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పై తరగతిలోకి వెళ్లే ముందు కింది తరగతిలో సాధించాల్సిన అభ్యాసన ప్రక్రియలు సాధిస్తున్నారా? లేదా? అనే విషయాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ ఏటా ర్యాండంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగా స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్) పరీక్షలు నిర్వహించటం జరిగిందన్నారు. పట్టణంలోని 23వ వార్డు ఎంపీపీఎస్ పాఠశాల, రైల్‌పేట ఎంపీపీఎస్ పాఠశాల, యూనిక్ కాన్సెప్ట్ స్కూల్, కేంద్రియ విద్యాలయం, మండలంలోని అబ్బూరు ఎంపీపీఎస్ (హెచ్‌ఈ), ధూళిపాళ్ల ఎంపీపీఎస్, రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గవ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 238 మంది విద్యార్థులకుగాను 216 మంది హాజరుకాగా 22 మంది గైర్హాజరయ్యారు.

జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



ఎన్నికల ప్రచారంలో కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశానికి దిక్సూచిగా నిలిపిన జగనన్న మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని 29వ వార్డులో మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండే ఎండల్ని, వడగాల్పుల్ని సైతం లెక్క చేయకుండా ఇంటింటిని సందర్శించారు. వార్డు సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను వివరించారు. ఓటర్లకు కరపత్రాలు అందజేసి ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల జనరంజక పాలనను సీఎం వైఎస్ జగన్ అందిస్తూ వచ్చారని వెల్లడించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా అందే ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన తనయుడు సీఎం జగన్ ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి వంటి అవకాశాలు కల్పించారని చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించి ముస్లింల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్లకు ప్రభుత్వం రూ. 45 కోట్లు ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ద్వారా ఆరు నెలల గౌరవ వేతనాన్ని ఏకకాలంలో విడదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇమాంలకు రూ. 10వేలు, మౌజన్లకు రూ. 5 వేల చొప్పున వేతనం అందిస్తూ ముస్లింల పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారని వెల్లడించారు. హజ్‌యాత్రకు కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటాను చెల్లించకపోతే రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం భరించి అత్యధిక మంది ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లేలా సహకరించిందన్నారు. సీఎం జగన్ పాలనలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్ పదవి షేక్ రఫానికు, ఇతర నామినేటెడ్ పదవులు లభించాయని వెల్లడించారు. ముస్లింలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్ ఆలి, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, పార్టీ వార్డు అధ్యక్షుడు దరియావలి, నాయకులు ముస్తఫా, పంతు బాజి, ఫరీదా, మాలిక్, గౌస్, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ మీరాబి, కె.రమణీబాయి, ములకలూరి బాజిమున్ని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

శావల్యాపురం: ఎన్నికల కోడ్ అమల్లో ఉందని రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ అధికారులకు సహకరించాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు.మంగళవారం మండలంలోని శానంపూడి, ముండ్రువారిపాలెం గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల సారథ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉందని గ్రామాల్లో ఫెక్సీలు తొలగింపుతో పాటు తిరునాళ్ల తదితర కార్యక్రమాలు అన్నీ నిషేధమన్నారు. గ్రామాల్లో గొడవలు అల్లర్లు సృష్టించకుండా ఉండేలా అసెంబ్లీ ఎన్నికల పూర్తయ్యే వరకు గ్రామాల్లో పోలీసు నిఘూ పటిష్టంగా ఉంటుందన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సంయమనం పాటించి ఎన్నికల సజావుగా జరిగేలా తమవంతు పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో కేంద్ర బలగాలచే 100 మంది పోలీసులు తుపాకులతో కవాతు నిర్వహించారు. ఆయనతో పాటు కేంద్ర బలగాల సర్కిల్ ఇన్‌స్పెక్టరు మీనా, ఎస్సై చల్లా సురేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మళ్లీ పట్టంకట్టండి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా కుటుంబసభ్యులు

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుటుంబ సభ్యులు పట్టణంలోని 1, 3, 5, 15, 16, 17, 18, వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డుల్లోని ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్యే బొల్లా వినుకొండకు చేసిన అభివృద్ధిని కరపత్రాల రూపంలో అందజేశారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుమార్తె మణికుమారి, అల్లుడు గంగాధరరావు, కోడలు స్వప్న, మనుమరాలు శ్రీతన్యలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడిక తీసేందుకు ఆక్రమణలు తొలగించండి

గృహవాసులకు సూచించిన మున్సిపల్ కమిషనరు



ఒకటో వార్డు వీధుల్లోని డ్రెయిన్లు పరిశీలిస్తున్న కమిషనరు, అధికారులు

నరసరావుపేట: ఇళ్ల ముందు ఉన్న మురుగు కాలువల్లో పూడిక తీసేందుకు వాటిపై ఉన్న నిర్మాణాలు, ఆక్రమణలను గృహవాసులు తొలగించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఒకటవ వార్డులోని కూనిశెట్టి లక్ష్మయ్య సత్రం, గుర్రాల చావిడి బజార్లు, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో 36 మంది వర్కర్లను నియమించామన్నారు. వార్డు మొత్తం కాలువలలో పూడికలు పూర్తిస్థాయిలో తీసి వెంటనే ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించటం జరుగుతుందన్నారు. కావున వార్డు ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించుకొని పురపాలక సంఘం వారికి సహకరించి పురపాలక శాఖ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహా రావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్ మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు యడ్లపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ రాజా (40) ఈవెంట్ డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి 11.45 గంటలకు చిలకలూరిపేట నుంచి యడ్లపాడు వెళ్లే క్రమంలో చిలకలూరిపేట ధనలక్ష్మి అతిథి గృహం సమీపంలో ఆటో దిగి జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ సమయంలో చిలకలూరిపేట నుండి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలైన రాజా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి అతని జేబులో ఉన్న ఫోన్‌నెంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మంగళవారం బంధువులకు అప్పగించారు. రాజా భార్య బెల్లంకొండ మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి 8, 10 తరగతులు చదువుతున్న ఇరువురు కుమార్తెలు ఉన్నారు.